# విరుగుడు

అదో పెద్ద హోటలు—

రాఘవయ్య ఆ హోటలు ప్రొప్రయిటరు. ఆ హోటలు ప్రారంభించిన దగ్గర్నించి, అతనెప్పుడూ వెనక్కి తిరిగి చూళ్ళేదు జీవితంలో. రెండు చేతులా ఆర్జించాడు.

కొడుకు రఘుపతి బి.ఏ. చదివినా, వుద్యోగాల్లో ఏముందనుకుని, హోటలు బిజినెస్‌లోనే తర్ఫీదు యిచ్చాడు, రాఘవయ్య. అప్పుడప్పుడూ కొడుకుని కౌంటరు దగ్గర కూచోబెడుతూండేవాడు.

ఆ రోజు కూడా, తను యెక్కడికో వెళ్ళాల్సి వుండి, కొడుకునే కౌంటరు దగ్గర కూచోమన్నాడు, రాఘవయ్య. రఘుపతి కూచున్నాడు.

"కాస్త జాగ్రత్తగా వుండరా అబ్బాయ్! ఏపాటి ఏమరుపాటుగా వున్నా, మనల్ని మోసం జేసేవాళ్లు ఎంతోమందున్నారు" అంటూ హెచ్చరిక చేసి, నిష్క్రమించాడు రాఘవయ్య.

"ఆ భయం మీకేం ఒద్దులెండి నాన్నా!" ఆయనకి వినిపించేలానే గట్టిగా అన్నాడు, రఘుపతి ఎంతో అనుభవం వున్నవాడిలా.

అదీ నిజమే! రఘుపతి, రాఘవయ్యకంటె వృద్ధండుడు. ఇతరుల్ని వంచించడంలో ఘనుడు. తండ్రి ఆకులమీద నడిచే నేర్పు గలవాడైతే, రఘుపతి చిగుర్లపై నడవగల సమర్థుడనే చెప్పాలి.

రఘుపతి, సర్వర్లను హెచ్చరిస్తునాడు. ఎవర్నీ ఓ చోట నిలబడ నివ్వడం లేదు. క్లీనర్లని గదమాయిస్తున్నాడు. చకచకా పనులు జరుగుతున్నయ్. అతని అజమాయిషీకి, వాళ్ళంతా లోలోన విసుక్కున్నారు.

కాస్సేపటికి పదిహేనేళ్ళ ఓ అబ్బాయి కౌంటరు దగ్గరకొచ్చాడు బిల్లు పట్టుకుని. బిల్లుతోపాటు, జేబులోంచి ఓ పది రూపాయల నోటు తీసి అందించాడు. కౌంటరు దగ్గర యింకెవ్వరులేరు రఘుపతి, ఆ అబ్బాయి మినహా.

ఎదురుగా వున్నవాడు చిన్న కుర్రాడు కాబట్టి, మోసగించినా తనకి మాట రాదన్న ఆలోచన మెరుపులా మెరిసింది రఘుపతికి. పది రూపాయలనోటు డ్రాయర్లో పడేసి, బిల్లు మాత్రమే చేత్తో పట్టుకున్నాడు.

"బిల్లు చేతిలో పెడితే సరిపోతుందా? డబ్బు యివ్వబ్బాయ్...." అన్నాడు, రఘుపతి సీరియస్‌గా.

ఆ అబ్బాయి, నిలువునా నీరైపోయాడు. అతనికి కళ్ళు చిమ్మ చీకట్లు క్రమ్మినట్టయ్యింది. ఇప్పుడే పది రూపాయలిస్తే, మళ్ళీ డబ్బు అడుగుతాడేవిఁటి?.... ఆశ్చర్యపోతూ అనుకున్నాడు.

"ఇప్పుడే కదండీ పది రూపాయల నోటిచ్చాను. డ్రాయర్లో పడేసి, తిరిగి నన్నడుగుతారేవిఁటి? మీరే తిరిగి డబ్బులివ్వాండి" అన్నాడు, ఆ అబ్బాయి.

గొప్ప రంగస్థల నటుడికయినా, అంత బాగా హావభావాలు రావేమో! అతని మొహం క్షణంలో అరుణకాంతిని పుంజుకుంది. "ఏవిఁటీ? పది రూపాయల నోటిచ్చావా? వేషాలు వెయ్యడానికి మరే చోటు దొరకలేదా? మా హోటలే కనిపించిందా నాయనా? ఇటువంటి వేషాలు నా దగ్గర పనికిరావు తెలిసిందా? ముందు డబ్బులిస్తావా, లేకపోతే బట్టలు విప్పించమంటావా?" అంటూ గర్జించాడు.

ఆ అబ్బాయి కంగారు పడిపోయాడు. నోట మాట రాలేదు. ఇంతలో "ఏమయ్యింది?" అంటూ నలుగురైదుగురక్కడ మూగారు.

"చూడండి, నేను పది రూపాయల నోటిస్తే, యివ్వలేదని దబా యిస్తున్నాడు." యేడుపు ముఖం పెడుతూ అన్నాడా అబ్బాయి.

"అంతా వట్టి అబద్ధం! అతడివ్వనేలేదు డబ్బు. పది రూపాయలిచ్చి నట్టు దబాయిస్తున్నాడు. ఈ కాలపు కుర్రాళ్ళకి అబద్ధ మాడ్డం, వంచిం చడం, అలవాటయిపోయింది. రుచులు కావాలి. ఎలా? ఈ పద్ధతులు అవలంబిస్తున్నారు. ఆ మొహం చూడండి .... వీడు వచ్చి అబద్ధాలకోరని యిట్టే తెలిసిపోతుంది." రఘుపతి అన్నాడు.

"లేదండీ! నే నబద్ధమాడ్డం లేదు. కావాలంటే ఆ డ్రాయర్లో చూడండి, నేనిచ్చిన పది రూపాయల కాగితం వుంటుంది." అబ్బాయి కాస్త ధైర్యంగానే చెప్పాడు.

రఘుపతి నవ్వేడు.

"పది రూపాయల నోట్లు యెన్నో వున్నాయి డ్రాయర్లో. అవన్నీ నువ్విచ్చినవే అన్నావుకాదింక .... పోనీ, ఆ నోటు నంబరు చెప్పు?"

నంబరు చెప్పడం యెవరితరం! "నంబరు నేను చూళ్ళేదండీ!" దిగాలుపడుతూ అన్నాడా అబ్బాయి.

అక్కడ చేరినవాళ్ళకీ, యీ సమస్య తికమక పర్చింది. ఆ అబ్బా యిని చూస్తుంటే, అతడు మంచి కుటుంబం నుంచి వచ్చినవాడిలానే కని పిస్తున్నాడు. మరి, హోటలువాడూ అబద్ధం చెబుతున్నాడని చెప్పలేరు. అందుకే, ఏమీ చెప్పకుండా ఒక్కొక్కరూ జారుకుంటున్నారు.

అయితే, అంతా విన్న రంగరాజుకి మాత్రం, అబ్బాయి నిజం చెబుతున్నాడనే అనిపించింది. కౌంటరు దగ్గరకొచ్చి తన బిల్లు యిచ్చేసి, "ఈ అబ్బాయి బిల్లు యెంతయ్యిందండీ?" అన్నాడు.

రఘుపతి, ఆశ్చర్యంగా అతనికేసి చూశాడు.

"ఏం మీరిస్తారా?" ప్రశ్నించాడు, రఘుపతి. ఆ స్వరంలో సౌమ్యత లేదు.

"ఇస్తే తప్పా?" సూటిగా ప్రశ్న వేశాడు, రంగరాజు.

"అబ్బే! తప్పని కాదులెండి. మంచిదే! ఎవరైనా యిటువంటి

పరిస్థితుల్లో ఆదుకోవడం అవసరం కూడాను. పాపం, అబ్బాయి డబ్బు తీసుకురావడం మర్చిపోయుంటాడు." అన్నాడు మెల్లగా రఘుపతి.

"ఏదో జరిగింది లెండి. అతని బిల్లు యెంతయ్యిందో చెప్పండి...."

"రెండు రూపాయలు...."

"ఇదిగోండి" అంటూ ఆ అబ్బాయికేసి తిరిగి "నువ్వెళ్ళబ్బాయ్ యింక" అన్నాడు రంగరాజు.

"థాక్సండి" పది రూపాయలు పోయినా, గుడ్డిలో మెల్లలా కనీసం తనకి అవమానం తప్పిందన్న సంతోషంతో కృతజ్ఞత చెప్పుకున్నాడు ఆ అబ్బాయి.

ఆ అబ్బాయి వెళ్ళినవేపే వెళ్ళి కాస్త దూరం వెళ్ళాక—

"చూడబ్బాయ్...." అంటూ పిలిచాడు, రంగరాజు.

"చెప్పండి సార్!" దగ్గరగా వచ్చాడు.

"నిజంగా నువ్వు పది రూపాయల నోటు యిచ్చావా?" ప్రశ్నించాడు.

"భగవంతుడి సాక్షిగా చెబుతున్నానండీ! ఇంట్లో టిఫిను చెయ్యలేదంటే, మా నాన్నగారే పది రూపాయలిచ్చి మార్చుకురమ్మన్నారండీ!"

"మీ నాన్నగారెవరు?"

"అకౌంటెంటు వాసుదేవరావండీ!"

"ఓ! అలాగా! సరే గాని, నువ్వో పని చేస్తావా?"

"చెప్పండి...."

"హోటలువాడు నిన్ను మోసం చేశాడని నాకనిపిస్తోంది. వాడికి తగిన బుద్ధి చెప్పాలి...."

"ఏం చెయ్యమంటారో చెప్పండి. వాడు మొహం ముడుచుకునేలా చెయ్యాలి."

"నీకు స్నేహితులున్నారుగా?"

"చాలా మందున్నారండీ! వాళ్ళని తీసుకెళ్ళి హోటల్లో గొడవ చెయ్యమంటురా?"

రంగరాజు మెల్లగా మందహాసం చేశాడు.

"అబ్బే! దౌర్జన్యం చెయ్యమని, నేనెప్పుడూ చెప్పను .... మీ

స్నేహితుణొకణ్ణి, రేపు యిదే సమయానికి కాస్తంత ముందుగా హోటలుకి వెళ్ళమను ఇరవై రూపాయల నోటు పట్టుకుని. బిల్లు యిచ్చినపుడు, యిరవై రూపాయల నోటు యిమ్మను. ప్రక్కన యింకెవరైనా వున్నపుడే యిమ్మను. ఆ నోటు మీద నీ సంతకంపెట్టి, నోటు నంబరు నోట్ చేసుకుని నీ దగ్గరుంచుకోవాలి."

"తర్వాత?" చాలా ఆసక్తితో అడిగాడు, ఆ అబ్బాయి.

"మీ స్నేహితుడు వచ్చాక నువ్వెళ్లు.... నేనూ అప్పటికి అక్కడే వుంటాన్లే. బిల్లు ముందుగా ఇచ్చేయ్. 'మిగతా డబ్బివ్వండి .... ఇరవై రూపాయల నోటిచ్చానుగా!' అను. వాడు నిజంగానే యీసారి కేకలేస్తాడు. మిగతాది నేను చూసుకుంటా." అంటూ ప్లాను చెప్పాడు.

"అలాగే నండి!" ఉప్పొంగిపోతూ అన్నాడు, ఆ అబ్బాయి. రంగ రాజు మంచితనాన్ని లోలోన అభినందించుకున్నాడు.

రంగరాజు తన దారిన తాను పోయాడు.

*　　*　　*

మరునాడు, రవీంద్ర అన్న కుర్రాడు అదే హోటలుకి అనుకున్న సమయానికి వెళ్ళాడు. టిఫిను కాఫీ తీసుకుని, కౌంటరు దగ్గిర యిద్దరు ముగ్గురున్నారింకా.

"ఇదిగోండి నా బిల్లు .... ఇదిగో ఇరవై రూపాయల నోటు. ఇది డ్రాయర్లో పడేసి, యివ్వలేదనగర్రు. మిగిలిన డబ్బివ్వండి" అన్నాడు, రవీంద్ర.

రఘుపతికి క్రితంరోజు సంఘటన గుర్తొచ్చి, గతుక్కుమన్నాడు.

"అబ్బే! అలా ఎందుకంటామండీ! నిన్నను ఆ అబ్బాయి ఇవ్వలేదు గాబట్టి అనాల్సి వచ్చింది." అంటూ ఇరవై రూపాయల నోటు తీసుకుని మిగిలిన చిల్లర యిచ్చేశాడు రఘుపతి.

రవీంద్ర వెళ్ళిపోయాడు.

పావు గంట గడిచింది. నిన్నను పది రూపాయలు పోగొట్టుకున్న అబ్బాయి వచ్చాడు. చుట్టూ కలయ జూశాడు. రంగరాజు ఓ మూల కూచుని వుండటం గమనించి, ఉత్సాహాన్ని తెచ్చుకున్నాడు. టిఫిను, కాఫీ

తీసుకుని బిల్లు పట్టుకుని, కౌంటరు దగ్గర రఘుపతి మినహా యింకెవరూ లేని సమయంలో వెళ్ళి, బిల్లు యిచ్చాడు, రఘుపతికి.

"డబ్బు యివ్వు. వట్టి బిల్లు యిస్తే యెలా?" విసురుగా అడిగాడు రఘుపతి.

"అదేవిటండీ! ఇప్పుడే ఇరవై రూపాయల నోటిచ్చాను కదండీ! మళ్ళీ డబ్బు అడుగుతారేవిటి?"

రఘుపతి విస్తుపోవడమే గాకుండా, వుగ్రుడైపోయాడు.

"ఏవిటీ, ఇరవై రూపాయల నోటిచ్చావా? నిన్ననూ ఇలాగే చేశావు .... ఈ రోజూ యిదే పద్ధతా! ఇంకెవరైనా ఆదుకుంటారని నీ ఉద్దేశం గామోసు. ఆ పప్పులేవి వుడకవ్. డబ్బులివ్వకపోతే బట్టలు విప్పిం చేస్తాం తెలుసా?" అంటూ కేకలు వేశాడు.

ఇద్దరు ముగ్గురు చేరారు ... రంగరాజూ వెళ్ళాడు, బిల్లు పట్టుకొని.

"మళ్ళీ యేమయ్యింది?" అన్నాడు రంగరాజు.

రఘుపతి రంగరాజుని ఉద్దేశించి "చూడండి, మళ్ళీ వీడు నిన్నటి లానే ప్లాను వేశాడు. ఇప్పుడేమో, ఇరవై రూపాయల నోటిచ్చానంటు న్నాడు. ఒక్కసారి వీడిలాంటివాడికి నాలుగు తగల్నిస్తే, యీ రోగం కుదురుతుంది" అన్నాడు.

"ఏవిటబ్బాయ్, ఏమయ్యింది?" ఆ అబ్బాయినే అడిగాడు రంగ రాజు,

"బిల్లుతోపాటు, ఇరవై రూపాయల నోటిచ్చానండీ! ఇవ్వలేదంటు న్నాడు. నిన్నను కూడా యిట్లాగే పది రూపాయల నోటిస్తే, దబాయిం చేశాడు. మీరు బిల్లిచ్చి ఆదుకున్నారు గాని, లేకుంటే నిన్నను నేను అవమానపడాల్సిందేగా! ప్రతి రోజూ ఇతనిలా చేస్తే యెలా?" కాస్త ధైర్యంగానే చెప్పాడా అబ్బాయి.

రఘుపతి రెచ్చిపోయాడు. "చూడండి, వాడు అబద్దాన్ని యెంత ధైర్యంగా చెబుతున్నాడో! ఒరేయ్ వెధవా, ఇటువంటి వేషాలు వేశావంటే స్తంభానికి కట్టించేసి, వొళ్లు హూణం చేయించేగల్ను ... ఆఁ!...."

రంగరాజు సీరియస్‌గా మొహం పెట్టాడు.

"మిష్టర్ రఘుపతీ! మీరు వ్యాపారం చేస్తున్నారు .... మాటలు

మర్యాదగా ఉండాలి. మీ మాటలు పడ్డానికి వాళ్లు రావడం లేదండీ యిక్కడికి!" అన్నాడు చిరుకోపంగా.

"అది కాదండీ!" తగ్గాడు, రఘుపతి.

అప్పుడే రాఘవయ్య అక్కడికి వచ్చాడు.

"మరేం చెప్పొద్దు. ఈ అబ్బాయి ఇరవై రూపాయల నోటిచ్చా నంటున్నాడు. చిల్లరివ్వండి."

రఘుపతి నివ్వెఱపోయాడు. "నాకివ్వలేదండీ! మీరూ నమ్మ రేవిఁటి?"

"నిన్నను నమ్మామండీ! కాని, రోజూ ఎలా నమ్మేది? చూడబ్బాయ్, ఆ నోటు నంబరు నీకు గుర్తుందా?"

"గుర్తేమిటండీ? నిన్నను యీయన నంబరు చెప్పమన్నాడుగా! అందుకని యివ్వాళ నంబరు రాసుకునే వచ్చాను.... ఇదిగోండి. అంతే కాదు ఆ నోటు మీద నా సంతకం వుంది .... జి. నిరంజన్ అని. కావా లంటే చూడండి ..." అంటూ జేబులోంచి నంబరున్న కాగితాన్ని తీసి యిచ్చాడు.

"సరే! రఘుపతి గారూ! మీ దగ్గరున్న ఇరవై రూపాయల నోట్లన్నీ తియ్యండి." అన్నాడు, రంగరాజు.

అక్కడ మూగినవాళ్ళంతా, తమాషాగా చూస్తున్నారు.

రఘుపతి, జంకూ, గొంకూ లేకుండా డ్రాయర్లో వున్న ఇరవై రూపాయల నోట్లు తీశాడు. మూడు ఇరవై రూపాయల నోట్లున్నయ్. రంగరాజు వాటిని పరిశీలించాడు. అందులో ఓ నోటు నంబరు, ఆ అబ్బాయి చెప్పిన నంబరుతో సరిపోయింది. ఆ నోటు మీద అతడి సంతకమూ వుంది.

"అదేవిఁటండీ? ఈ నోటు నంబరు సరిపోయింది. సంతకమూ వుంది. ఇతడిచ్చిన నోటే! అన్నాడు, రంగరాజు.

రఘుపతి నీరైపోయాడు. ఆ అబ్బాయి యివ్వలేదు కదా, యెలా వచ్చింది? అతనికేం అర్థం కాలేదు.

"ఇదెలా వచ్చిందండీ?"

"ఏమో! ఎవరికి తెలుసు? నిన్నను మీరేగా నోటునంబరు అడిగారు.

ఈ రోజు యీ అబ్బాయి, నోటు నంబరు నోటు చేసుకుని, మరీ వచ్చాడు. ఇలా మీరు యెంతమందిని మోసగిస్తున్నారో యేమిటో! ఇది మంచిది కాదండీ! మీ హోటలు పడిపోతుంది."

రఘుపతి నోట మాట రాలేదు. చప్పున రాఘవయ్య కలిగించుకున్నాడు.

"బాబూ! ఏదో పొరపాటు జరిగింది. చిన్నవాడు .... క్షమించండి బాబూ! మిగిలిన డబ్బు యిచ్చేస్తాను." అంటూ రంగరాజుని బ్రతిమాలాడాడు, పద్దెనిమిది రూపాయలూ యిచ్చేసి.

"మరి మీవాడు ఆ మాట చెప్పడం బావుంటుందండీ!" విడిచిపెట్టలేదు రంగరాజు.

రాఘవయ్య కొడుకేసి చూశాడు. "క్షమాపణ చెప్పుకోరా వెధవా! నీవల్లనే యివ్వాళ నేను మొహం దించుకోవల్సి వచ్చింది." అన్నాడు కోపంగా.

రఘుపతి మొహం వాడిపోయింది. ఇంకేం చెప్పగలడు?

"క్షమించండి!" అని మాత్రం అనేశాడు.

రంగరాజు తృప్తిగా నవ్వుకున్నాడు.

ఆ అబ్బాయి రంగరాజుకేసి తిరిగాడు. 'ఇప్పుడేం చెయ్యడమండీ!' అన్నట్టుందా చూపు.

రంగరాజు ఆ అబ్బాయి చేతిలో డబ్బు తీసుకుని అందులోంచి పది రూపాయల నోటు తీసి రాఘవయ్యకి అందజేశాడు.

"ఇదేమిటండి?" అర్థం గాక అడిగాడు, రాఘవయ్య.

"రాఘవయ్యగారూ! మీ అబ్బాయి నిన్నను పది రూపాయలనోటు తీసుకుని అబద్ధమాడాడు. అందుకు గుణపాఠంగా యివ్వాళ యీ ప్లాను వేశాను. ఈ రోజు మాత్రం ఈ అబ్బాయి ఇరవై రూపాయల నోటివ్వ లేదు. అంతకుముందు మరో అబ్బాయి తెచ్చిచ్చిన ఇరవై రూపాయల నోటు మీద సంతకంచేసి, నంబరు నోటు చేసుకోవడం జరిగింది. మీవాడి మోసానికి, యిది విరుగుడు. అయితే అన్యాయంగా యీడబ్బు మాకొద్దు. ఈ పదీ వుంచండి." అన్నాడు.

రాఘవయ్య, రఘుపతి నిర్ఘాంతపోయారు. అభినందించారు. అక్కడ చేరినవాళ్లు రంగరాజు సమయస్ఫూర్తికి.

"మీరు నిన్నను నా బిల్లు చెల్లించారు....అది తీసుకోండి." అంటూ ఆ అబ్బాయి డబ్బు యివ్వబోయాడు రంగరాజుకి.

"వద్దోయ్ .... నా తమ్ముడిలాంటి వాడివి .. ఫరవాలేదులే!"

"రంగరాజు గారూ! ఈ రోజు నా జీవితంలో మర్చిపోలేనండీ!" అన్నాడు, రఘుపతి కృతజ్ఞతా భావంతో.

"వస్తానండీ!" నవ్వుకుంటూ, ఆ అబ్బాయి భుజమ్మీద చెయ్యి వేసి బైటికి నడిచాడు రంగరాజు.

రఘుపతి కౌంటరునుండి దిగిపొయ్యాడు. రాఘవయ్య కూచున్నాడు

ఆ రోజు నుంచీ మళ్ళీ అటువంటి సంఘటన జరుగలేదు.

* ఆంధ్ర సచిత్ర వారపత్రిక, 3-9-1976 *